


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 284, పేజీలు - 08

బుధవారం, ఏప్రిల్ 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణపై క్యాన్సర్ పంజా

**- ప్రతి ఏడాది వేల సంఖ్యలో కొత్త కేసులు**

**- పురుషుల్లో 58 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే - క్యాన్సర్ కేసులపై ఐసీఎంఆర్ షాకింగ్ నివేదిక**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రం విషయంలో ఐసీఎంఆర్ ఆందోళనకరమైన ఒక రిపోర్ట్ ను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని ఐ సి ఎం ఆర్ తాజా నివేదిక వెల్లడించింది. తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్ 2026 పేరుతో విడుదలైన ఈ రిపోర్టు ప్రకారం ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో కొత్త రోగులు నమోదు అవుతున్నారని పేర్కొంది.

## క్యాన్సర్ వ్యాప్తిపై ఐసీఎంఆర్ ఆందోళన

ఇంతగా క్యాన్సర్ వ్యాప్తి చెందుతుంటే ముందస్తు స్క్రీనింగ్ పట్ల అవగాహన లేకుండా ప్రజలు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. నివేదిక ప్రకారం 30నుంచి 49సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలలో కనీసం నాలుగు శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్ష చేయించుకోవటం లేదని పేర్కొంది. రాష్ట్రంలో రొమ్ముక్యాన్సర్ స్క్రీనింగ్ రేటు 0.3% గా, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతంగా, మహిళలను నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5శాతంగా నమోదయ్యాయి.

## 2030 నాటికి భారీగా క్యాన్సర్ కేసులు

పురుషులలో అయితే నోటి క్యాన్సర్ పరీక్షలు కేవలం 2.6%గా మాత్రమే నమోదయింది. ఐసీఎంఆర్ ఈ గణాంకాలను నిమ్స్ తో సహా 10 ఆసుపత్రుల నుండి సేకరించింది ఇక ఐ సి ఎం ఆర్ అంచనాల ప్రకారం 2026 చివరినాటికి తెలంగాణ రాష్ట్రంలో 46,762 కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. 2030 నాటికి ఈ సంఖ్య సంవత్సరానికి 47,314 కు చేరవచ్చునని అంచనా వేస్తున్నారు.

## ప్రధాన కారణం దీని వలనే

గత దశాబ్దంలో ఈ కేసుల సంఖ్య 30 శాతం పెరగగా, 2017లో 40 వేల 177 ఉన్న కేసులు 2024 నాటికి మొత్తం 52 వేల 334 కి చేరింది.

ఇక మహిళలలో ప్రతి లక్షకు 183.8 మంది, పురుషులలో 149 మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. అయితే మగవారిలో నమోదవుతున్న క్యాన్సర్లో పొగాకు వాడకం వల్ల వస్తున్న క్యాన్సర్ ఎక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది.

## ఈ వ్యాధులతో బాధ పడేవారికి క్యాన్సర్ ముప్పు

ఇటు స్త్రీలలో కూడా పొగాకు వాడిన వారు క్యాన్సర్ బారిన పడుతున్నారు. పురుషులలో 58.8%, స్త్రీలలో 29.7 శాతం పొగాకు వాడకం వల్లే క్యాన్సర్లు వచ్చినట్టు నివేదిక పేర్కొంది. నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్లు తెలంగాణ రాష్ట్రంలో అధికంగా నమోదవుతున్నాయి. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును బాగా పెంచుతున్నాయి.

## ప్రాథమిక దశలో గుర్తిస్తేనే క్యాన్సర్ నయం

అయితే క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉంటుందని, ఆలస్యం చేసే కొద్దీ క్యాన్సర్ రిస్క్ ఎక్కువ అవుతుందని ఐ సి ఎం ఆర్ హెచ్చరిస్తుంది. కనుక క్యాన్సర్ పరీక్షలు పైన అవగాహన పెంచుకొని, ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తుంది.

3,000 పెన్షన్, ఉచితంగా

# ఎల్పీజీ సిలిండర్లు

**- కేరళలో బీజేపీ మేనిఫెస్టో**



**తిరువనంతపురం (ప్రశ్న న్యూస్)** కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేసింది. కేరళలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నవీన్, కేరళ బీజేపీ సీనియర్ నేత రాజీవ్ చంద్రశేఖర్, ఇతర సీనియర్ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం తిరువనంతపురంలో కేరళ అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఓనమ్, క్రిస్మస్ పండగ సందర్భంగా ఉచితంగా ఎల్పీజీ అందిస్తామని బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. అలాగే ప్రతి నెలా 20 వేల లీటర్ల నీళ్లను కూడా అందిస్తామని తెలిపింది. ఈ మేరకు బీజేపీ తన మేనిఫెస్టోలో మహిళలు, యువత కోసం అనేక పథకాలను ప్రకటించింది. కేరళలో ఎయిమ్స్ నిర్మిస్తామని నితిన్ నవీన్ హామీ ఇచ్చారు.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షుడు నితిన్ నవీన్, సీనియర్ పార్టీ నాయకులతో కలిసి తిరువనంతపురంలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. కేరళలోని పేద కుటుంబాలకు ప్రతి సంవత్సరం రెండు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు ఇస్తామని పేర్కొంది. ఒక సిలిండర్ ను ఓనం పండుగ సందర్భంగా అలాగే మరొకటి క్రిస్మస్ సందర్భంగా పంపిణీ చేస్తారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నెలకు 20,000 లీటర్ల ఉచిత నీటిని అందిస్తామని కూడా బీజేపీ హామీ ఇస్తోంది.అంతేకాక దిగువ పేదరికం కుటుంబాలకు చెందిన వారికి ప్రతి నెలా రేషన్ సదుపాయం, అందరికీ ఆయుష్మాన్ భారత్ పీఎం- జేఏవై కవరేజీ వర్తింపు, రాష్ట్రంలో

2లో..

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి

# సీఐడీ నోటీసులు

**వెనక్కి తగ్గేది లేదంటూనే ప్రభుత్వంపై ఆరోపణలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు ఇచ్చింది. గతంలో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4వ తేదీన ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని నోటీసులలో సీఐడీ పేర్కొంది. ఈ ఒక్క కేసులోనే కౌశిక్ రెడ్డితో పాటు మొత్తం 16 మంది బీఆర్ఎస్ నాయకులకు నోటీసులు అందినట్లు తెలుస్తోంది.

### కుటుంబ సభ్యులకు సీఐడీ నోటీసులు.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆవేదన

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎటువంటి తప్పు చేయకపోయినా, కేవలం ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో తనకు, తన కుటుంబ సభ్యులకు మరియు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు సీఐడీ నోటీసులు ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో, తనపై కాకుండా తన కుటుంబ సభ్యులపై ఇలాంటి బెదిరింపులకు దిగడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పోరాటం ఏదైనా ఉంటే నేరుగా తనతో చేయాలని, కుటుంబాన్ని ఇందులో లాగడం బాధాకరమని పేర్కొన్నారు.

2లో..

## ట్యాంక్ బండ్ శివకు సీఎం ఆపన్న హస్తం

**- రూ.5 లక్షలు సహాయం, కుమారుడికి ఉద్యోగం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ట్యాంక్ బండ్ మీద వంద మందికిపైగా ప్రాణాలను కాపాడి రియల్ హీరో అని పేరు తెచ్చుకున్న ట్యాంక్ బండ్ శివ కు తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ట్యాంక్ బండ్ శివ కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి వెంటనేన స్పందించారు. ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన ట్యాంక్ బండ్ శివ ప్రస్తుతం ఉపాధి లేక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. దీంతో ట్యాంక్ బండ్ శివ కుటుంబాన్ని పిలిపించిన రేవంత్ రెడ్డి, వారితో మాట్లాడారు. వారి కష్టనష్టాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ట్యాంక్ బండ్ శివకు తెలంగాణ

2లో..

# ప్రతి నెలా 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్'

**- ప్రజారోగ్యంపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష**

- జులైనాటికి రాష్ట్రమంతా సంజీవని ప్రాజెక్టు అమలుకు ఆదేశం
- 5 కీలక అంశాలతో "ఏపీ హెల్త్ మానేజ్మెంట్ పాలసీ" రూపకల్పన
- సిజేరియన్లు 20 శాతానికి మించితే ఆడిటింగ్ చేయాలని స్పష్టం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల్లోకి వెళ్లి ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా, ప్రతి నెలా నాలుగో శనివారాన్ని 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' దినంగా పాటించాలని, ఆ రోజున గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో 'సంజీవని' ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో విజయవంతంగా అమలవుతున్న సంజీవని ప్రాజెక్టును జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. రాబోయే ఏడాదిలో రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పరీక్షల ఫలితాలను 48 గంటల్లోనే నేరుగా వారి వాట్సప్‌కు పంపాలని ఆదేశించారు. దీనికోసం 904 మొబైల్ మెడికల్ యూనిట్లు అవసరమవుతాయని, రూ.162 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు వివరించగా, ముఖ్యమంత్రి వెంటనే ఆమోదం తెలిపారు. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో ఇప్పటికే 3.14 లక్షల మంది నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రతి వ్యక్తి హెల్త్ రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ,

2లో..

# మాంసం ప్రియులు నోరు కట్టేసుకోవాల్సిందే

**- నేటి నుంచి చికెన్ షాపులు బంద్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చికెన్ రిటైల్ షాపులకు వచ్చే మార్జిన్‌లో కార్పొరేట్ కంపెనీలు మార్జిన్ తగ్గించి ఇవ్వడాన్ని నిరసిస్తూ నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. చికెన్ దుకాణ నిర్వాహకులు నేటి తేదీ నుంచి దుకాణాలు బంద్ చేస్తామని ప్రకటించారు. మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ దుకాణాలు బంద్ చేపడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర చికెన్ దుకాణాల యాజమాన్యాల సంఘం పిలుపునిచ్చింది. చికెన్ దుకాణాల బంద్ ప్రభావం తెలంగాణలో తీవ్రంగా ఉండనుంది.చికెన్ దుకాణ యాజమాన్యాల పిలుపుతో నేటి నుంచి అంటే బుధవారం నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి.

2లో..

మా నీళ్లు దోచుకుంటే

# ఊరుకోం

**- ఏపీ ప్రభుత్వానికి మంత్రి జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్**

2లో..



క్వాంటం అప్లికేషన్లతో

# ఆంధ్రప్రదేశ్ కే తొలి ప్రయోజనాలు

**- "మేడ్ ఇన్ అమరావతి" బ్రాండ్ తో క్వాంటం హార్డ్ వారే ఉత్పత్తి లక్ష్యం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ - క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

2లో..

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

**- కాంగ్రెస్ పై ప్రధాని మోదీ ఫైర్**



**గాంధీ నగర్ (ప్రశ్న న్యూస్)** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన

2లో..

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

**- మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్**



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ బుధవారం 1, ఏప్రిల్ 2026

# 3,000 పెన్షన్, ఉచితంగా ఎల్‌పీజీ సిలిండర్లు

ఎయిమ్స్ క్యాంపస్, పెన్షన్ ను రూ. 3000 లకు పెంచడం, హై స్పీడ్ కారిడార్ తదితర వరాలు మేనిఫెస్టోలో ఉన్నాయి. అలాగే వికసిత్ కేరళ లో భాగంగా శబరిమల, గురువాయూర్ వంటి పుణ్యక్షేత్రాలను పరిరక్షించేందుకు దేవస్వం బోర్డులను పునర్వ్యవస్థీకరించనున్నట్లు బీజేపీ స్పష్టం చేసింది.ఇక ముల్లపెరియార్ డ్యామ్ విషయంలో తమిళనాడుకు నీటిని, కేరళకు భద్రతను కల్పిస్తామని కూడా మేనిఫెస్టో హామీ ఇస్తోంది. అర్హులైన మహిళలకు, వితంతువులకు, అలాగే 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు నెలకు రూ. 3,000 సంక్షేమ పింఛన్ కూడా ఇవ్వనున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించింది. అలాగే భక్ష్య ఆరోగ్య సురక్షా కార్డు కింద బీపీఎల్ కుటుంబాలకు ప్రతి నెలా రూ. 2,500 సాయం అందజేయనున్నారు. ఇక కొచ్చి మెట్రో రైలు మిగిలిన ఫేజ్ లను పూర్తి చేయడం, తిరువనంతపురం, కోజికోడ్ లో మెట్రో సర్వీసులు చేపట్టనున్నట్లు మేనిఫెస్టోలో బీజేపీ తెలిపింది.

## ప్రతి నెలా 4వ శనివారం

# 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్'

భవిష్యత్తులో వైద్య ఖర్చులు తగ్గించేలా నివారణ ఆరోగ్య చర్యలపై (ప్రివెంటివ్ హెల్త్) దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో భాగంగా ఐదు కీలక అంశాలతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ'ని తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని అనే 5 పిల్లర్లతో ఈ పాలసీని పటిష్టంగా రూపొందించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' అమలుపైనా చర్చించారు. మరోవైపు, అనవసర సిజేరియన్లను నివారించాలని, అత్యవసరమైతే తప్ప సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సిజేరియన్లు 20 శాతానికి మించితే తప్పనిసరిగా ఆడిటింగ్ చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖలో ఖాళీలను రేషనలైజేషన్ ద్వారా భర్తీ చేయాలని, పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్ శివకు సీఎం ఆపన్న హస్తం

ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ట్యాంక్ బండ్ శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డు ఉద్యోగం ఇస్తామన్న రేవంత్ రెడ్డి, హోంగార్డు నియామక పత్రాన్ని వేణుమాధవ్?కు మంగళవారం అందజేశారు. ప్రమాదవశాత్తు, అలాగే వివిధ కారణాలతో హుస్సేన్ సాగర్‌లో పడిన ఎంతోమంది ప్రాణాలను కాపాడిన శివ ట్యాంక్ బండ్ శివగా పేరు తెచ్చుకున్నారు. అయితే కుటుంబ పోషణ భారమై శివ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలియటంతో శివ కుటుంబానికి అవసరమైన సహాయం అందించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలు చేపట్టిన అధికారులు, వారికి జీవనోపాధి కల్పించేలా పలు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శివ కుటుంబం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం కలిసింది.ఈ సందర్భంగా ఉపాధి కోసం ట్యాంక్ బండ్ దగ్గరలో స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ ముఖ్యమంత్రిని కోరారు. దీంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీని ద్వారా మరికొంతమంది యువతకు శివ, ఈతలో శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అలాగే ట్యాంక్ బండ్ శివ కుటుంబానికి సొంతిల్లు లేదని తెలుసుకున్న సీఎం శివ కుటుంబానికి డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. తమ కుటుంబ సమస్యలపై స్పందించి సాయం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ట్యాంక్ బండ్ శివ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాయం అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు.

# మాంసం ప్రియులు నోరు కట్టేసుకోవాల్సిందే

రిటైల్ చికెన్ షాపులకు ఇచ్చే మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా ఆ సంఘం నిరసనకు దిగుతోంది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే లాభం (మార్జిన్) తగ్గించడంతో తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఈ మార్జిన్‌ను పెంచాలని చికెన్ దుకాణాల యాజమానులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. మార్జిన్ తగ్గించడంతో తాము ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోయారు. దుకాణాల రెంట్, వర్కర్ల జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న తమకు మార్జిన్ పెంచడంతో వ్యాపారం చేయలేని పరిస్థితి ఏర్పడిందని మరో చికెన్ దుకాణ యజమాని వివరించారు. ప్రభుత్వం ఆలోచించి మార్జిన్ పెంచే ప్రయత్నం చేయాలని కోరారు. తమ సమస్యకు పరిష్కారం చూపని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

### రేవంత్ రెడ్డికి సవాల్.. వెనక్కి తగ్గేది లేదు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. "నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై కేసులు పెట్టండి, నోటీసులు ఇవ్వండి, కానీ నా కుటుంబాన్ని మరియు పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టకండి" అని కౌశిక్ రెడ్డి హితవు పలికారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని నోటీసులు వచ్చినా తాను భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అణచివేత ధోరణికి భయపడి వెనక్కి తగ్గనని, ప్రజల పక్షాన నిలబడి తన పోరాటాన్ని కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు.

### ప్రజల పక్షాన పోరాటం చేస్తాను

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తాను ప్రశ్నిస్తూనే ఉంటానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం తాను చేపట్టిన బాధ్యత అని ఆయన అభివర్ణించారు. ప్రశ్నించే గొంతును అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై తన నిలదీత కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు తన సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### అసలేం జరిగింది? వివాదం నేపథ్యం ఇదే

గతంలో తన నియోజకవర్గం హుజూరాబాద్‌లో జరిగే మినీ సమ్మక్క-సారలమ్మ జాతరకు తన కుటుంబంతో కలిసి వెళ్తున్న కౌశిక్ రెడ్డిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, హుజూరాబాద్ రోడ్డుపై బైఠాయించి భారీ నిరసన చేపట్టారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేయడమే కాకుండా, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి కొన్ని మతపరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించి, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

# మా నీళ్లు దోచుకుంటే ఊరుకోం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు.జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు.ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## క్వాంటం అప్లికేషన్లతో

# ఆంధ్రప్రదేశ్ కే తొలి ప్రయోజనాలు

జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే, ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

### 'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం

రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు స్టార్టప్‌లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్‌ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు. క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.

# కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు.ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## అమెరికా సాయం చేయదు..

# మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# వైభవంగా శ్రీవారికి స్నపన తిరుమంజనం



తిరుమల (ప్రశ్న న్యూస్) వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలలో భాగంగా రెండవ రోజైన మంగళవారం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది.ఇందులో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.
ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 1న పౌర్ణమి గరుడసేవ రద్దు

శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 1వ తేదీన పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. శ్రీవారి వార్షిక వసంతోత్సవాలు జరుగుతున్న కారణంగా పౌర్ణమి గరుడసేవ రద్దయింది. ఈ విషయాన్ని భక్తులు గమనించగలరు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలియజేశారు.

## సజావుగా మంథని సహకార సంఘం

# సర్వసభ్య సమావేశం



**మంథని ( ప్రశ్న న్యూస్)** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని కార్యాలయంలో మంగళవారం జరిగిన 88వ సర్వ సభ్య సమావేశం సజావుగా జరిగింది. సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్, సంఘ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టి అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ ఏఎంసి చైర్మన్ ఆకుల కిరణ్, సంఘ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉదయశ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘ మాజీ డైరెక్టర్లు, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ జమ ఖర్చుల పట్టికను చదివి వినిపించారు. అలాగే సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమివ్వడం తో పాటు సభ్యుల సూచనలను తీసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, మద్దికట్ల స్రవంతి, జంబోజు శ్రీమతి, వేముల లక్ష్మి, ఎల్లంకి వంశీధర్, సర్పంచు ఆర్ల నాగరాజు, పోచయ్య, గుడిసె గట్టయ్య, గట్టయ్య, సంఘ మాజీ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, మాచిడి రాజుగౌడ్, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, కొత్త శ్రీనివాస్, దేవల్ల విజయ్ కుమార్, నాయకులు మూల పురుషోత్తం రెడ్డి, రామడుగు మారుతి, గోటికార్ కిషన్,గుండా పాపారావు, పర్వవేన మోహన్,ఎరుకల ప్రవీణ్, అయిలి శ్రీనివాస్, ఊట్ల అనిల్, డిగంబర్. , మంథని లక్ష్మణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) చైత్రమాసంలో పౌర్ణమి తరువాత శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 7న ఈ కుంభోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు ( కొబ్బరికాయలు,గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం అనగా ఈ రోజున అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

# ఏప్రియల్ 1 అక్కమహాదేవి జయంతి



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) మల్లికార్జునస్వామివారి పరమ భక్తులలో ఒకరైన అక్కమహాదేవి వారి జయంత్యోత్సవం చైత్రపౌర్ణమి సందర్భంగా రేపు ఉదయం గం.9.00 నుండి సంప్రదాయబద్ధంగా నిర్వహించ బడుతుంది. ఈ జయంత్యోత్సవము నందు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవివారికి అభిషేకం, విశేషార్చనలు జరిపించబడుతాయి.
కాగా 12వ శతాబ్దంలో కన్నడ ప్రాంతాన శివశరణులుగా ప్రసిద్ధి పొందిన మహాభక్తులలో అక్కమహాదేవి ఒకరు. వీరవిరాగిణిగా పేరొందిన అక్కమహాదేవి శ్రీశైలమల్లికార్జునస్వామివారిని తమ జీవిత భాగస్వామిగా భావించి తరించింది.శ్రీశైల మల్లికార్జునుడిపై ఎన్నో వచనాలను చెప్పిన అక్కమహాదేవి సంస్కృత,కన్నడ భాషలలో ఎంతో ప్రవీణురాలని చెప్పబడుతోంది. కన్నడ వచన సారస్వతంలో ఈమెను విశిష్ట వచనా రచయిత్రిగా సాహితీవేత్తలు పేర్కొంటారు. ఇప్పటికీ అక్కమహాదేవి వచనాలు శివశరణాలనే పేరుతో ఎంతో ప్రచారంలో ఉన్నాయి. ఈ వచనాలలో మధుర భక్తే కాకుండా జ్ఞాన, వైరాగ్యాలకు సంబంధించిన ఎన్నో అంశాలు కనిపిస్తాయి.శ్రీశైల మల్లికార్జునునిలో ఐక్యం కావాలనే చిరకాల వాంఛ గల అక్కమహాదేవి తన జీవితపు చివరి రోజులను శ్రీశైలంలోనే గడిపింది. ప్రస్తుతం అక్కమహాదేవి గుహలుగా పిలువబడుతున్న ఇక్కడి గుహలలో కొంత కాలం తపస్సు చేసిన ఈ సాధకురాలు ఇక్కడి కదళీవనంలో మరికొంత కాలం తపస్సు చేసి, ఈ కదళీవనంలోనే సిద్ధి పొందిందని చెప్పబడుతోంది.అక్కమహాదేవిజయంతిని పురస్కరించుకుని రేపు సాయంకాలం నిత్యకళారాధన వేదికపై అక్కమహాదేవి జీవిత విశేషాలపై ప్రవచన కార్యక్రమము ఏర్పాటు చేయబడింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న :ఏపీ రాష్ట్ర గవర్నర్



తిరుమల (ప్రశ్న న్యూస్ )శ్రీవారిని మంగళవారం ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌ను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ సాదరంగా అహ్వానించగా, అర్చక బృందం ఇస్తికఫాల్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఎస్.అబ్దుల్ నజీర్ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఈవో, అదనపు ఈవోలు తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, విజివో రామ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రొయ్యూరు గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

- మన ఊరు మన బాధ్యత
- నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత అవసరం ఏటూరనాగారం ఎస్సై మహేష్



**ఏటూరునాగారం** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అధ్యక్షతన "మన ఊరు మన బాధ్యత" 99రోజుల గ్రామ ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో యువత, గ్రామ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంనికి స్థానిక ఎస్సై మహేష్ హాజరై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రొయ్యూర్ గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతూ, ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల పని చేస్తుందని, నేరస్తులను గుర్తించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రొయ్యూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని, అన్ని రంగాల్లో రొయ్యూర్ ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం
- ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది
- మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు మార్చి31 :** ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు."గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**హుజూర్నగర్ :**నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దెందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి, సత్ఫాలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారుపట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.



**నిర్మల్:** బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

## - రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు

**ఆదిలాబాద్** పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన నిర్వహించారు.ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్‌కు గుడ్‌బై?

- కాంగ్రెస్‌లో చేరికలు



**భైంసా:** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పోట్పెల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ బోర్రోళ్ల చరణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ విరి తమ అనుచరులతో కలిసి పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజురా సర్పంచ్ ముత్తా గౌడ్, మన్మథ్ సర్పంచ్ లలిత భోజన్న, మాజీ జిల్లా వైస్ చైర్మన్ రాజన్న, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ గీతాభవాని సాయిప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లుట్లలో మధ్యాహ్న భోజన పథకంను తనిఖీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని



**మాచవరం** :మాచవరం మండలం, పిల్లుట్ల గ్రామం నందు గుర్రం వీర గోపాల కృష్ణారెడ్ల ప్రభుత్వ పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణంను తరగతి గదులను పరిశీలించి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజనం ప్రతీ రోజూ మెనూ ప్రకారం సుచిగా రుచిగా పెడుతున్నార లేదా అని యరపతినేని విద్యార్థుల అభిప్రాయం ను అడిగి తెలుసుకున్నారు.

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.అనంతరం మహిళ, ట్రాన్స్ జెండర్ ప్రయాణికులను, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళ ఉద్యోగులు, మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన

**-అంగన్వాడీ, సఖి కేంద్రాల ఆకస్మిక తనిఖీ**

**-జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ( ప్రశ్న న్యూస్) జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం అమలు వంటి అంశాలను పర్యవేక్షించారు.కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి, వారి చదువు స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహన గురించి పలు ప్రశ్నలు వేసి పరీక్షించారు.మధ్యాహ్న భోజనం అమలుపై మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.? ఆహార నాణ్యత, వంట విధానం, వంటశాల, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలల్లో అన్ని సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ నేపథ్యంలో కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించి, వారి ఆరోగ్య స్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోషకాహారం సరైన విధంగా అందుతుందా? మెనూ ప్రకారం వంటలు తయారు చేస్తున్నారా.? అనే విషయాలను కలెక్టర్ పర్యవేక్షించారు.అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాల నాణ్యత, వండే విధానం, పరిశుభ్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని, అంగన్వాడీ సిబ్బంది బాధ్యతగా పని చేసి పిల్లలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.తదనంతరం జిల్లా కేంద్రంలో గల సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేపట్టారు.ఈ క్రమంలో సఖి కేంద్రంలో బాధిత మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలపై కలెక్టర్ ఆరా తీశారు.సేవలు సమయానికి, సమర్థవంతంగా అందుతున్నాయా? సఖి కేంద్రానికి ఎలాంటి కేసులు వస్తున్నాయి? వచ్చిన కేసులకు ఎలా కౌన్సిలింగ్ ఇస్తున్నారు? అని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సఖి కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించే విధంగా సిబ్బంది పని చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది ఆదర్శ మహిళా జాతీయ పురస్కారం -2026

**అందుకున్న ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని రవీంద్రభారతిలో మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కడపగాండ్ల డా.చక్రవర్తి ఆధ్వర్యంలో శ్రీపరాభవనామ ఉగాది పురస్కారాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.తండ్రి విధివిధానాలు,తల్లి శాంతి సహనాన్ని స్ఫూర్తిగా అలవర్చుకొన్నారు. ఉగాది ఆదర్శ మహిళా జాతీయ పురస్కారం అవార్డు -2026 గ్రహిత శ్రీమతి నీలాజ్యోతి.వివిధ ఫ్యామిలీ సమస్యలపై పరిష్కారం మార్గం చూపిస్తున్నందుకు గాను,స్వచ్ఛందంగా సేవా సహకారం అందిస్తున్నందుకు గాను,సేవా మూర్తులపై కవితల రూపంలో అక్షర కలము నుండి ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు,ఆధ్యాత్మికంగా సామాజికంగా ప్రజలతో కలిసి పని చేస్తున్నందుకు విశ్రాంత టీటీడీ జెఈఓ లక్ష్మీకాంతం(ఐఏఎస్),ఎం.వి.రావ్ ఫౌండేషన్ అధినేత లీలా మోహన్ కృష్ణ,మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి,విశ్రాంత జడ్జి మాల్యాద్రి,న్యూ కంబాల శివ లీలారెడ్డి,మనం ఫౌండేషన్ కార్యనిర్వాహకులు డా.చక్రవర్తి,దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా ఉగాది ఆదర్శ జాతీయ మహిళా పురస్కారం 2026 కు రిజిస్టర్డ్ డిప్లొమా ఇన్ జనరల్ నర్సింగ్ ఇన్ మిడ్వైఫరీ,సంఘసేవకురాలు,ఫ్యామిలీ మోటివేటర్,పొయెట్ జర్నలిస్ట్,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి అందుకున్నారు.రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో తండ్రి,తల్లి స్ఫూర్తి తో సమాజసేవ చేస్తున్న ఉత్తమ ఉగాది ఆదర్శ మహిళ జాతీయ పురస్కార అవార్డు గ్రహిత నీలాజ్యోతి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.విశ్రాంత జడ్జి మాల్యాద్రి మాట్లాడుతూ ఆదర్శ భావనలతో చతుర్ముక లక్ష్యాలతో విశిష్ట సేవలు చేస్తున్న ఆదర్శ మహిళా నీలాజ్యోతి అని అభినందనలు తెలిపారు.పురస్కారం అందించినందుకు మనం ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చక్రవర్తి యాదవ్ కి,సేవా మూర్తులను గుర్తించి ప్రోత్సహిస్తున్న డా.చక్రవర్తి,న్యూ కంబాల ఫౌండేషన్ డా.శివలీల రెడ్డి,బి.యస్.నారాయణ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన ఉగాది ఆదర్శ మహిళ జాతీయ పురస్కారం-2026 అందుకున్నందుకు నీలాజ్యోతి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.వీరితో పాటు అంగన్వాడీ టీచర్ శ్రవంతి,కూచిపూడి పండితురాలు సురభి,మామిళ్లపల్లి ఉమారాణి(సూర్యాపేట),సోమవరపు అన్నపూర్ణ(ఐ.వి.యఫ్),శిరీష వంగేటి(ఐ.వి.ఎఫ్),ఎంవీ రావు వ్యవస్థాపకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని రంగాల అవార్డు గ్రహితలు పాల్గొన్నారు.

## కాప్రా, నాచారం సర్కిల్ల వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్ లతో ఎం ఎం సి కమిషనర్

**- సూపర్వైజర్ లతో పాటు పాల్గొన్న సీనియర్ ఎంటమాలాజిస్టు, కాప్రా, నాచారం డిప్యూటీ కమిషనర్లు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)కాప్రా, నాచారం సర్కిల్ల వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్ లతో కమిషనర్ ఎం ఎం సి వినయ్ క్రిష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. వార్డు సూపర్వైజర్ లతో మాట్లాడుతూ ఉదయం హాజరు నమోదు మొదలు విధులు పూర్తి అయ్యే వరకు వారి రోజువారీ విధులను అడిగి తెలుసుకున్నారు.దోమల నివారణకు ప్రతి ఇంటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట దోమల నివారణ కెమికల్ స్ప్రే చేయాలని ఆదేశించారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఎలా చేస్తున్నారో అడిగి ఇంకా మెరుగుపరచాలని తెలిపారు.చెరువులలో గుర్రపు డెక్క తొలగించడం, గంబూసియా చేపలను వదలడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎం ఎం సి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి తో పాటు సీనియర్ ఎంటమాలాజిస్టు మాధవరెడ్డి, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో ప్రతిభ జాతర, ఆర్‌జీఓఐ టోర్నమెంట్ ఘన విజయం

**- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వైపు క్రీడాకారులను ప్రేరేపించిన ఛాంపియన్‌షిప్**

**- ఆర్‌జీఓఐ ఓపెన్ స్టేట్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహణ**

**- బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి స్కేటర్లు**







దమ్మాయిగూడ(ప్రశ్న న్యూస్) ఆర్‌జీఓఐ ఓపెన్ స్టేట్ స్కేటింగ్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా, పోటీ తత్వంతో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ టోర్నమెంట్‌లో బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుండి స్కేటర్లు భారీ సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. క్రీడాకారుల క్రీడాస్ఫూర్తి, ప్రతిభ ప్రేక్షకులను ఆకట్టుకుంది. వివిధ వయస్సు విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్న యువ క్రీడాకారులు తమ నైపుణ్యాలను చూపిస్తూ మెరుగైన ప్రదర్శనలు చేశారు. ఈ వేదిక యువ ప్రతిభకు ఒక గొప్ప అవకాశంగా నిలిచింది. కోచ్‌లు, తల్లిదండ్రులు, నిర్వాహకులు అందించిన సహకారం టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు కీలక పాత్ర పోషించింది. వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఐజాజ్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ అజీజ్, జాయింట్ సెక్రటరీ ఎం.డి ఫయాజ్ నేతృత్వంలో ఈ పోటీలు సమర్థవంతంగా నిర్వహించబడ్డాయి. వారి కృషి, అంకితభావం ఈ టోర్నమెంట్‌ను ఘన విజయంగా నిలబెట్టాయి. మిషన్ స్కేటింగ్ అకాడమీ, దమ్మాయిగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ముగిసింది. ఈ పోటీలు యువ స్కేటర్లకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మెరుగైన లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిచ్చాయి.

## కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీసు స్టేషన్ లో పేలుడు ఘటనపై స్పందించిన : హోం మంత్రి అనిత

**కృష్ణా జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి**

**పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం**



కృష్ణా జిల్లా(ప్రశ్న న్యూస్)చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై రాష్ట్ర హోం మంత్రి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, వెంటనే స్పందించిన మంత్రి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఎస్‌ఐ దుర్గాంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా సహా ఇతర సిబ్బందికి తక్షణం మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడలోని ఆస్పత్రికి తరలించి ప్రత్యేక వైద్యం అందించాలని అధికారులను సూచించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను సేకరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీశ్రీశ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు

**వైభవంగా అమ్మవారి జాతర వేడుక**



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) శ్రీ శ్రీ శ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారిని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ,పద్మజ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి గర్భాలయంలో ఆలయ అర్చకులు పసుపు, కుంకుమతో ఎమ్మెల్యే దంపతులతో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో గాయత్రి రాజ్ గోపాల్ అమ్మవారి చిత్ర పటాన్ని ,ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ అమ్మవారి దయతో ఎటువంటి విపత్తులు, చెడు సంఘటనలు జరగకుండా ,ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన ప్రభుత్వ యంత్రాంగానికి, శుభాకాంక్షలు తెలిపారు.. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామి కటాక్షం



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవరోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల-లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాత ప్రభుత్వం మాది

**-మంత్రి నారాయణ**

**ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి**

**40 ఏళ్ల నాటి సమస్యకు నెల రోజుల్లోనే పరిష్కారం**

**జూన్ 12 కల్లా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి.**

**రాష్టానికే ఆదర్శంగా నగరాన్ని తీర్చిదిద్దుతాం**

**పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్య**

**లోకేష్ విజన్‌తో టిడ్కో ప్రాంగణంలో హైటెక్ పాఠశాల**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) నగర అభివృద్ధిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు.అందులో భాగంగా నగరంలో మంగళవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు . పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా పొర్లుకట్ట ప్రాంతంలో 1.2 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్వయంగా పరిశీలించారు .40 ఏళ్ల నాటి స్థానికుల సమస్యకు నెల రోజుల్లోనే పరిష్కారం చూపుతామన్నారు .నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ వీధిలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు .?అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద 28 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసారు ., ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాలంలోనే రోడ్డు పూర్తి చేస్తామన్నారు.జేమ్స్ గార్డెన్‌లో ఎన్టీఆర్ సుజల 30వ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. భవిష్యత్తులో నగరవ్యాప్తంగా 120 ప్లాంట్లు ఏర్పాటు చేసి, రోజుకు 6 లక్షల లీటర్ల మినరల్ వాటర్‌ను కేవలం 2 రూపాయలకే 20 లీటర్ల చొప్పున అందజేస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్ ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి ,టీడీపీ నేతలు ధర్మవరం సుబ్బారావు ,పెంచల బాబు ,పోకల రవి ,సుజన్ ,జహీర్ ,జమీర్ ,జంషీద్ ,సుధాకర్ రెడ్డి ,కార్పొరేషన్ ,విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు

## మోహిని అలంకారంలో పల్లకిపై విహరించిన కోదండరాముడు - భక్తులకు కనువిందు



ఒంటిమిట్ట(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం ఉదయం స్వామివారు మోహిని అలంకారంలో పల్లకిపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు ఈ వాహనసేవ భక్తి భావంతో వైభవంగా జరిగింది. భజన బృందాల హారతులు, కోలాటాల మధ్య స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.మోహిని అవతార వృత్తాంతం భాగవతంలో ఎంతో రమణీయంగా వర్ణించబడింది. సురాసురులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథిస్తారు. చివరికి అమృతం లభించినప్పుడు దానిని పంచుకునే విషయంలో కలహం చెలరేగుతుంది. ఆ కలహాన్ని నివారించి అసురులను మోహింపజేసి దేవతలకు అమృతాన్ని అందించేందుకు శ్రీహరి మోహిని రూపంలో అవతరించారు. తన భక్తులు కానివారు మాయకు లోనవుతారని, భక్తులు మాత్రం ఆ మాయను సులభంగా అధిగమించగలరని ఈ మోహిని రూపం ద్వారా స్వామివారు సూచిస్తున్నారని పురాణాలు తెలియజేస్తున్నాయి.వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీటితో సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరాములవారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు.ఈ రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు అత్యంత వైభవంగా గరుడసేవ జరగనుంది.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

**- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్**



గజ్వేల్(ప్రశ్న న్యూస్) ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ బస్టాండ్‌ల ఆధునీకరణ, నిర్మాణాల కోసం నిధులను మంజూరు చేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా అవసరాలను గుర్తించి, వెంటనే నిధులు విడుదల చేసి యుద్ధప్రతిపాదికన బస్టాండ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కర్ పద్మాబాయి నర్సింగ్ రావు, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో జల దోపిడీ

**-రేపటి తరం గతి ఏంటి.?**

**- ట్యాంకర్ల జోరు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు**

**- ఎండిపోతున్న బోర్లు ఆందోళనలో ప్రజలు**

**నీటి ట్యాంకర్లు' కాదు.. 'జల రక్కసి**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలో నీటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. సామాన్యుడి గొంతు ఎండగడుతూ, భూగర్భ జలాలను యథేచ్ఛగా తరలిస్తూ కాసుల వేటలో పడ్డారు కొందరు స్వార్థపరులు. వందలాది ట్యాంకర్లు నిత్యం భూమి పొరల్లోని నీటిని తోడేస్తుంటే, అటు పాలకులు, ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ జలాలను తోడేస్తూ, వాణిజ్య అవసరాలకు తరలిస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందలాది ట్యాంకర్లు నిత్యం నీటిని తరలిస్తుండటంతో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోతుంది.

## ఎండిపోతున్న బోర్లు - ఆందోళనలో ప్రజలు

ఒకప్పుడు మేడ్చల్‌లో 100 - 200 అడుగులకే నీళ్లు పడేవి. గతంలో పుష్కలంగా నీరు ఉన్న ఇళ్లలోని బోర్లు ఇప్పుడు చుక్క నీరు రాక వెక్కిరిస్తున్నాయి. పట్టణ పరిధిలో యథేచ్ఛగా



సాగుతున్న ఈ జల దోపిడీ వల్ల సామాన్యులు తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రింబవళ్లు భారీ మోటార్లతో నీటిని తోడేయడంతో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోతుంది.

## నీటి ట్యాంకర్లు' కాదు.. 'జల రక్కసి

భారీ నీటి ట్యాంకర్లు (5500 లీటర్ల సామర్థ్యం) ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ట్రాక్టర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని తోడేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నివాస ప్రాంతాల్లో భారీ మోటార్ల ద్వారా నీటిని తోడటం చట్టవిరుద్ధం. భూగర్భ జలాలు రీఛార్జ్ అయ్యే సమయం కూడా ఇవ్వకుండా నిరంతరాయంగా తోడటం వల్ల భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది. అనుమతులు లేకుండానే వాణిజ్య అవసరాలకు నీటిని తరలిస్తున్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో ట్రిప్పులలో నీటిని



తోడేస్తున్నారు. మా ఇళ్లలో నీళ్లు రావడం లేదు కానీ, ఈ ట్యాంకర్లకు మాత్రం నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అధికారులు మాఫియాతో చేతులు కలిపారా?" అని స్థానిక మహిళలు నిలదీస్తున్నారు.

## రేపటి తరం గతి ఏంటి.?

ఇదే పరిస్థితి కొనసాగితే మేడ్చల్ త్వరలోనే ఎడారిగా మారడం ఖాయం. వాల్టా చట్టం పుస్తకాలకే పరిమితమైందా ? భారీ మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా నీటిని తోడుతున్న బోర్లను తక్షణమే సీజ్ చేసి నివాస ప్రాంతాల నుండి వాణిజ్య అవసరాలకు నీటిని తరలించే ట్యాంకర్లపై భారీ జరిమానాలు విధించాలని పలువురు కాలనీలలోని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిహెచ్ఎంసి పరిధిలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. వారు ప్రదర్శించిన ఆటపాటలు, నృత్యాలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది ఇక్కడే పడుతుందని, క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి, వారిని అభినందించారు.

# ప్రాణదాతలుగా మారిన '108' సిబ్బంది

**ఇంటి వద్దే పురుడు పోసి తల్లిని, బిడ్డను కాపాడిన ఈఎంటీ సీతారామ్**

**దేవుడు అంబులెన్స్ రూపంలో వచ్చి మా బిడ్డను కాపాడాడు**

**-ఆర్తి కుమారి కుటుంబ సభ్యులు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ఆ తల్లి పురిటి నొప్పులతో విలవిల్లాడుతోంది. ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే సమయం మించిపోతోంది. కళ్లముందే చావుబతుకుల పోరాటం సరిగ్గా అదే సమయంలో '108' సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఆ కుటుంబంలో వెలుగులు నింపారు. 108 ఈఎంటీ సీతారామ్ తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామానికి చెందిన ఆర్తి కుమారి అనే గర్భిణికి మంగళవారం ఉదయం తీవ్రమైన పురిటి నొప్పులు మొదలయ్యాయి. కంగారుపడిన ఆమె భర్త సమంజ సద వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. నిమిషాల్లోనే గుండ్లపోచంపల్లికి చెందిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ సీతారామ్, పైలట్ అశోక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఆర్తి కుమారి పరిస్థితిని గమనించిన సీతారామ్, ఆమెను ఆసుపత్రికి తరలించేంత సమయం లేదని గుర్తించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, ఫోన్ ద్వారా ఈఆర్సీపీ డాక్టర్ స్మిత సూచనలు తీసుకుంటూ ఇంటి లోపలే మంగళవారం ఉదయం 9:30 గంటలకు సీతారామ్ ఆర్తి కుమారికి పురుడు పోశాడు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్న సిబ్బంది, మెరుగైన వైద్యం కోసం వారిని వెంటనే మేడ్చల్ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు.

## వెల్లువెత్తిన ప్రశంసలు..

సమయానికి స్పందించి, ప్రాణాలకు తెగించి పురుడు పోసిన సీతారామ్, అశోక్ లను చూసి ఆర్తి కుమారి కుటుంబ సభ్యులు ఆనంద బాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. "దేవుడు అంబులెన్స్ రూపంలో వచ్చి మా బిడ్డను కాపాడాడు" అంటూ వారు కొనియాడారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఈ 108 వీరులను గ్రామస్తులు మరియు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

# సీజింగ్ చేసిన బిల్డింగ్ కు టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు

**-అధికారులు మారితే సీజింగ్ బిల్డింగ్ పై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోరా.?**

**- చట్టాలను తుంగలో తొక్కి తమకు అనుకూలంగా మార్చుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

**- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టే బిల్డింగ్ లకు విద్యుత్ మీటర్లు ఇవ్వవచ్చా.?**

**- ఫిర్యాదులు చేసిన పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు - ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి నిర్మాణాలు**



ఉప్పల్ ( ప్రశ్న న్యూస్) రామంతపూర్ డివిజన్ శారద నగర్ లో అనుమతుల విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ ను సీజ్ చేసిన సీజింగ్ బోర్డును తొలగించి ప్రభుత్వం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న స్థానికులు ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన దినపత్రికల్లో సీజింగ్ బిల్డింగ్ పనులు




నిర్వహిస్తున్నారని దినపత్రికలో ప్రచురించిన అధికారులకు తెలిపిన చూసి చూడనట్టు ఉంటున్నారు అంటే సీజింగ్ బిల్డింగ్ ఓనర్ కు టౌన్ ప్లానింగ్ అధికారులకు మధ్య కుదిరిన ఒప్పందం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజలు అనేకమార్లు ఈ బిల్డింగ్ పై ఫిర్యాదు చేసిన ఎక్కడ సెట్ బ్యాక్ లేకుండా ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఉప్పల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమూర్తి, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ తో కలిసి శారద నగర్ లో నిర్మిస్తున్న బిల్డింగ్ను సీజ్ చేశారు. తదనంతరం టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమూర్తి కాప్రాకు బదిలీపై వెళ్లగా కొత్తగా ఉప్పల్ ఏసిపి నాగిరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ రాజేందర్ విధులు నిర్వహిస్తున్న స్థానికులు పలుమార్లు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా ఉంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి,


ప్రజాప్రశ్న

రామంతపూర్ డివిజన్‌లో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు

సీజింగ్ చేసిన బిల్డింగ్ సీజింగ్ తొలగించి నిర్మాణం చేపడుతున్నారని అధికారులు సేవింగ్ చేసిన పనులను పూర్తి చేసుకుంటున్నారు అంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇంటి యజమానికి కుదిరిన ఒప్పందం ఏమిటని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తూ వారికి సహకరిస్తున్నారని ప్రభుత్వ అనుమతులతో జి ప్లస్ టు అనుమతులు తీసుకొని ఏదేచ్ఛగా రాజకీయ నాయకులు అండదండలతో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న బిల్డింగ్లకు విద్యుత్ మీటర్లు అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు విద్యుత్ శాఖ అధికారులు పానెల్ బోర్డులు, విద్యుత్ మీటర్లు ఎలా ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతుల విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ లేకుండా యదేచ్ఛగా విద్యుత్ మీటర్లు ఇవ్వడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టే బిల్డింగ్లకు, అపార్ట్మెంట్లకు, విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. యదేచ్ఛగా నిర్మాణం చేపడుతూ పనులు పూర్తి చేసుకుంటున్న శారద నగర్ సీజింగ్ బిల్డింగ్ను ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

# హనుమాన్ జయంతి వేడుకలకు సిద్ధమైన దేవతలగుట్ట

**దేవాదాయ ధర్మకర్త మందాడి శివారెడ్డి**



బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) బాలాపూర్ మండల పరిధిలోని దేవతలగుట్టపై వెలసిన స్వయంభూ ఆంజనేయస్వామి (దేవాదాయ.ధర్మదాయ శాఖ.రి.నం. ఏ4/3141/2000) ఆలయంలో ఆంజనేయస్వామి జన్మదినోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు దేవాలయ ధర్మకర్త మందాడి శివారెడ్డి తెలిపారు. చైత్రమాసం పౌర్ణమి రోజు హనుమంతుని పవిత్ర జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, కలియుగంలో కూడా



ఆంజనేయస్వామి అమరత్వం కలిగి ఉంటారని, బలం, భక్తి, ధైర్యం, నిస్వార్థతకు ప్రతీక అయిన హనుమంతుని పవిత్ర జన్మదినోత్సవం నాడు అపారమైన భక్తిశ్రద్ధలు, విశ్వాసంతో ప్రత్యేక పూజలు చేయడంతో జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులు, కష్టాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని తెలిపారు. హనుమాన్ జయంతికి హిందూ మతంలో గొప్ప ప్రాముఖ్యత ఉందని, శ్రీరాముని దైవిక భక్తుడిగా, కలియుగంలో భక్తుల రక్షకుడిగా ఆంజనేయ స్వామికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఈ పవిత్రమైన రోజున, భక్తులు ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలతో పాటు హనుమాన్ చాలీసా పఠిస్తే ప్రతికూల శక్తులు, అడ్డంకులు తొలగిపోతాయని తెలిపారు. ఆధ్యాత్మికపరంగా హనుమంతుడు



అచంచలమైన విశ్వాసం, క్రమశిక్షణ, అంతర్గత శక్తికి నిదర్శనమని, ఒత్తిడితో కూడుకున్న నేటి కాలంలో హనుమాన్ జయంతి మరింత ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతిని జరుపుకోవడంతో ప్రతి ఒక్కరి జీవితంలో ధైర్యం, బలం, విజయం, దైవికశక్తి పొందవచ్చని తెలిపారు. దేవతల గుట్టపై తేదీ 2 ఏప్రిల్ గురువారం నాడు నిర్యహించనున్న అంజనేయస్వామి జయంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులవ్వాలని కోరుచు, భక్తుల సౌకర్యార్థం కొండపై మంచినీటి వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు శివారెడ్డి తెలిపారు.

## ఓటీటీలోకి అడుగుపెడుతున్న

# 75 కోట్ల సినిమా!

ఓటీటీలోకి అడుగుపెట్టడానికి ఒక తమిళ సినిమా రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'తాయి కిళవి'.




రాధిక ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా నిర్మాతలలో శివ కార్తికేయన్ ఒకరుగా వ్యవహరించడం విశేషం. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, తొలి రోజునే సక్సెస్ టాక్ ను సొంతం చేసుకుంటూ దూసుకెళ్లింది. 10 కోట్ల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 75 కోట్ల వరకూ రాబట్టింది. లుక్ పరంగా .. నటన పరంగా రాధిక మంచి మార్కులు కొట్టేసిన ఈ సినిమాలో, మునీశ్ కాంత్ .. సింగం పులి .. అరుళ్ దాస్ .. బాలశరవణన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. అలాంటి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'జియో హాట్ స్టార్' వారు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి తమిళంతో పాటు వివిధ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. కథలోకి వెళితే రాధిక పాత్ర పేరు 'పవనుత్తాయి'. 70 ఏళ్ల వయసున్న ఆమె వడ్డీ వ్యాపారం చేస్తూ ఆస్తిపాస్తులను బాగానే వెనకేస్తుంది. ఆమె అంటే ముగ్గురు కొడుకులకు .. కోడళ్లకు హడల్. అందరినీ భయపెడుతూ బ్రతికేస్తూ వచ్చిన ఆమె, పక్షవాతంతో మంచాన పడుతుంది. మాటపడిపోయిన ఆమె సైగలతో రోజులు నెట్టుకొస్తూ ఉంటుంది. సంపాదించిందంతా ఆమె బంగారంగా మార్చేసి దాచి ఉంచిందని భావించిన కుటుంబ సభ్యులు ఏం చేస్తారు? అనేది కథ.



## వంశీ పైడిపల్లి సినిమాలో

# సల్మాన్ సరసన నయన్..

**- అధికారిక ప్రకటన**

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం (#ఎస్వీసీ63). ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అందుకే వారిని పట్టించుకోవడం

# మానేశా: నిహారిక



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు. నిర్మాతగా కెరీర్ ప్రారంభించినప్పటి నుండి తనపై ఎన్నో విమర్శలు వస్తున్నాయని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏం చేసినా తప్పు పట్టేవాళ్లు ఉంటూనే ఉంటారు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో 11 మంది కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు.. ఎందుకు ఇదంతా? తెలిసిన వాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' వంటి హై-వోల్టేజ్ వీఎఫ్ఎక్స్ సినిమా చేస్తుంటే... మళ్లీ చిన్న కథలే చేయొచ్చు కదా అని సలహాలు ఇస్తున్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉంటారు, అందుకే వారిని పట్టించుకోవడం మానేశాను" అని ఆమె తెలిపారు. నిర్మాతగా ప్రతి సినిమా తనకు ఒక పాఠమని, నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని నిహారిక తెలిపారు. "నాకు కొణిదెల కుటుంబం ఎంత ముఖ్యమో, నా 'పింక్ ఎలిఫెంట్' టీమ్ కూడా అంతే ముఖ్యం. నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను" అని ధీమా వ్యక్తం చేశారు.

## ఓటీటీలో దూసుకుపోతున్న

# కన్నడ మూవీ!



ఇటీటీలో ఇప్పుడు ఒక కన్నడ మూవీ దూసుకుపోతోంది .. ఆ సినిమా పేరే 'ల్యాండ్ లార్డ్'. జదేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో,దునియా విజయ్ .. రచితా రామ్ .. రాజ్ బి శెట్టి ప్రధానమైన పాత్రలను పోషించారు. సూరజ్ గౌడ నిర్మించిన ఈ సినిమాను జనవరి 23వ తేదీన విడుదల చేశారు. 12 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 7 కోట్లకి మించి వసూళ్లను రాబట్టలేకపోయింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో అందుబాటులో ఉంది. 'ల్యాండ్ లార్డ్' సినిమాకి సంబంధించిన స్ట్రీమింగ్ హక్కులను 'జీ 5' వారు దక్కించుకున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేస్తున్నారు. అయితే తెలుగు ఆడియో అందుబాటులో లేదు. దునియా విజయ్ కూతురు 'రితన్య' ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్రను పోషించింది. అజనీశ్ లోక్ నాథ్ అందించిన సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలిచిందనే ఒక టాక్ బలంగానే వినిపించింది. థియేటర్ల వైపు నుంచి ఓ మాదిరి మార్కులను రాబట్టుకున్న ఈ సినిమా, ఓటీటీలో దూసుకుపోతోందని అంటున్నారు. 1980లలో నడిచే కథ ఇది. రాచయ్య ఓ సాధారణ రైతు .. అతని భార్యనే లింగమ్మ .. వారి కూతురే భాగ్య. ఆ గ్రామానికి చెందిన భూస్వామిగా రాజ్ బి శెట్టి ఉంటాడు. అతను పరమ దుర్మార్గుడు. ఇటు రాజకీయ నాయకులను .. అటు పోలీస్ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఒక ఆటాడిస్తూ ఉంటాడు. రైతు కూలీలను అణచివేస్తున్న భూస్వామి పట్ల రాచయ్య ఎలా స్పందిస్తాడు? ఆ ఫలితాన్ని ఆయన కుటుంబం ఎలా ఫేస్ చేస్తుంది? అనేది కథ.

# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ



ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

## యూట్యూబ్‌లో లీకైన 'ధురంధర్ 2'..

## అభిమానుల ఫిర్యాదుతో లింక్ డిలీట్!



బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ధురంధర్ 2' (ధురంధర్: ది రివెంజ్) పైరసీ ఉచ్చులో చిక్కుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం.. తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో లీక్ కావడం కలకలం రేపుతుంది. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా నడుస్తున్న ఈ సినిమా పూర్తి నిడివి గల పైరేటెడ్ వెర్షన్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేశారు. దీంతో మొబైల్ ద్వారా రికార్డ్ చేసిన దాదాపు 4 గంటల నిడివి గల ఈ వీడియోను అప్పటికే వేలాది మంది నెటిజన్లు వీక్షించారు. అయితే ఈ పైరసీ అప్‌లోడ్‌ను గమనించిన అభిమానులు వెంటనే సోషల్ మీడియా వేదికగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ట్యాగ్ చేస్తూ అలర్ట్ చేశారు. ఇక అభిమానుల నుంచి వచ్చిన సమాచారంతో చిత్రబృందం తక్షణమే రంగంలోకి దిగి, యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. ఆ పైరేటెడ్ లింక్‌ను విజయవంతంగా డిలీట్ చేసింది యూట్యూబ్.మరోవైపు ఈ పైరసీ అడ్డంకులు వలన సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం జోరు తగ్గలేదు. కేవలం రెండు వారాల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1400 కోట్ల మైలురాయికి చేరువలో ఉంది. ఇప్పటికే నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచి 'బాహుబలి 2' రికార్డులను సైతం అధిగమించింది. రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్ మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం ప్రస్తుతం రికార్డుల వేటను కొనసాగిస్తోంది.

# రామాయణ టీజర్‌కు భారీ హైప్..




దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం రామాయణపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పౌరాణిక ఇతిహాసాన్ని ఆధునిక టెక్నాలజీతో ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించాలన్న లక్ష్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో సినిమా నుంచి ఫస్ట్ టీజర్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 2న టీజర్‌ను రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. టీజర్ విడుదలకు ముందే అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాకు హైప్ క్రియేట్ చేయాలన్న ఉద్దేశంతో మేకర్స్ ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ టీజర్ సుమారు 2 నిమిషాల 38 సెకన్ల నిడివితో ఉండబోతోందని టాక్.

ఇందులో ప్రధాన పాత్రలైన రాముడు, సీతతో పాటు రావణుడు, హనుమంతుడు పాత్రలను పరిచయం చేయనున్నారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని గ్లోబల్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే హిందీతో పాటు ఇంగ్లీష్‌లో కూడా టీజర్ విడుదల చేయనున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండబోతున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.సినిమాకు సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ మరియు హాన్స్ జిమ్మెర్ కలిసి అందిస్తున్నారు. ఈ అరుదైన కాంబినేషన్ సినిమా స్థాయిని మరింత పెంచనుందని భావిస్తున్నారు. ఈ మహత్తర ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. రామాయణ టీజర్ విడుదలకు ముందే భారీ హైప్ సృష్టించడంతో, ఈ చిత్రం భారతీయ సినిమాను మరోసారి ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుందా అనే ఆసక్తి నెలకొంది. టీజర్ విడుదల తర్వాత ఈ అంచనాలు మరింత పెరగడం ఖాయం.

# శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి

**- ఎస్పీ మహేష్ బి. గితే**

**- 41ఏళ్ల సేవలకు ముగింపు**

**- ఏ.ఎస్సై. కొమురయ్య ఉద్యోగ విరమణ**

**- ఏఎస్ఐ కొమురయ్యకు ఘన సన్మానం**



బోయినిపల్లి /సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) పోలీస్ శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఏఎస్ఐ కొమురయ్యకు జిల్లా పోలీస్ శాఖ ఘనంగా సన్మానం నిర్వహించింది. 1985లో కానిస్టేబుల్‌గా సేవలో చేరిన ఆయన, 41 సంవత్సరాలపాటు అంకితభావంతో విధులు నిర్వర్తించి, ఏఎస్ఐ స్థాయికి ఎదిగారు.ప్రస్తుతం బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కొమురయ్యకు జ్ఞాపిక అందజేసి, ఆయన సుదీర్ఘ సేవలను కొనియాడారు. పోలీస్ శాఖలో ఆయన చూపిన క్రమశిక్షణ, కట్టుబాటు ఇతరులకు ఆదర్శమని తెలిపారు.పోలీసులు విధులు సక్రమంగా నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమని, వారి ప్రోత్సాహం వల్లే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని పేర్కొన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవితం గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఎటువంటి అవసరం ఉన్నా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, కొమురయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సజావుగా మంథని సహకార సంఘం

# సర్వసభ్య సమావేశం.



మంథని ( ప్రశ్న న్యూస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని కార్యాలయంలో మంగళవారం జరిగిన 88వ సర్వ సభ్య సమావేశం సజావుగా జరిగింది. సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్, సంఘ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ ఏఎంసి చైర్మన్ ఆకుల కిరణ్, సంఘ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉదయశ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘ మాజీ డైరెక్టర్లు, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగిశీచారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ జమ ఖర్చుల పట్టికను చదివి వినిపించారు. అలాగే సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమివ్వడం తో పాటు సభ్యుల సూచనలను తీసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, మద్దికట్ల స్రవంతి, జంబోజు శ్రీమతి, వేముల లక్ష్మి, ఎల్లంకి వంశీధర్, సర్పంచు ఆర్ల నాగరాజు, పోచయ్య, గుడిసె గట్టయ్య, గట్టయ్య, సంఘ మాజీ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, మాచిడి రాజుగౌడ్, పెద్దిరాజు ప్రభాకర్, రావికటీటి సతీష్ కుమార్, కొత్త శ్రీనివాస్, దేవల్ల విజయ్ కుమార్, నాయకులు మూల పురుషోత్తం రెడ్డి, రామడుగు మారుతి, గోటికార్ కిషన్,గుండా పాపారావు, పర్వవేన మోహన్,ఎరుకల ప్రవీణ్, అయిలి శ్రీనివాస్, ఊట్ల అనిల్, డిగంబర్. , మంథని లక్ష్మణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సజావుగా మంథని సహకార

# సంఘం సర్వసభ్య సమావేశం.



మంథని ( ప్రశ్న న్యూస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని కార్యాలయంలో మంగళవారం జరిగిన 88వ సర్వ సభ్య సమావేశం సజావుగా జరిగింది. సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్, సంఘ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ ఏఎంసి చైర్మన్ ఆకుల కిరణ్, సంఘ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉదయశ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘ మాజీ డైరెక్టర్లు, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగిశీచారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ జమ ఖర్చుల పట్టికను చదివి వినిపించారు. అలాగే సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమివ్వడం తో పాటు సభ్యుల సూచనలను తీసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, మద్దికట్ల స్రవంతి, జంబోజు శ్రీమతి, వేముల లక్ష్మి, ఎల్లంకి వంశీధర్, సర్పంచు ఆర్ల నాగరాజు, పోచయ్య, గుడిసె గట్టయ్య, గట్టయ్య, సంఘ మాజీ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, మాచిడి రాజుగౌడ్, పెద్దిరాజు ప్రభాకర్, రావికటీటి సతీష్ కుమార్, కొత్త శ్రీనివాస్, దేవల్ల విజయ్ కుమార్, నాయకులు మూల పురుషోత్తం రెడ్డి, రామడుగు మారుతి, గోటికార్ కిషన్,గుండా పాపారావు, పర్వవేన మోహన్,ఎరుకల ప్రవీణ్, అయిలి శ్రీనివాస్, ఊట్ల అనిల్, డిగంబర్. , మంథని లక్ష్మణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు కన్నీళ్లు ఉసురు ప్రభుత్వానికి తగులుతుంది

**- రాజకీయం చేసి రైతుల పుట్టగొట్టడం సమంజసం కాదు**

**- ఒక దఫా నీటి విడుదల చేయకపోతే లక్ష ఎకరాల పంట ఎండిపోతుంది**

**- తుక్కాపూర్ వద్ద రైతులతో కలిసి మంజీర నదిలో నిరసన చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం రైతుల కన్నీళ్లు ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు సింగూరు నుంచి జీరో పాయింట్ 3 నీటి విడుదల కోసం అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళేపటికి. ప్రభుత్వం నీటి విడుదల చేయలేదని పేర్కొన్నారు ఈ సందర్భంగా గంటపాటు మంజీరా నదిలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా రైతులు బి ఆర్ ఎస్ స్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశార మాట్లాడుతూ ప్రభుత్వం నీటి విడుదలపై జీవో జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు సింగూర్ నుంచి ఘనాపూర్ ఆనకట్టకు నీటి విడుదల చేయలేదని పేర్కొన్నారు మంజీరా పరివాక ప్రాంతం ఘనాపూర్ ఆనకట్ట కింద సుమారు లక్ష ఎకరాల వరి పంట సాగు చేసుకున్నారని తెలిపారు ఒక దఫా నీటి విడుదల చేస్తే రైతుల సాగుచేసిన పంట చేతికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ నీటి విడుదల చేయకపోతే రైతులు తీవ్రంగా



నష్టపోతారని తెలిపారు ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇవ్వకుండా తప్పించుకుందని రైతులు పెట్టుబడి కోసం వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పంట సాగు చేశారని పేర్కొన్నారు

అంతకుముందు తుక్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు అలాగే లబ్ధిదారులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి మండల టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి గౌరీ శంకర్ వేమారెడ్డి మల్లేశం తుక్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు ఉపసర్పంచ్ రవీందర్ తోపాటు పలువురు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ప్రవేశ పరీక్షల లొ సీతాయిపేట్ విద్యార్థుల విజయకేతనం

**- ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న**



దర్పల్లి(ప్రశ్న న్యూస్ ) నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం సితాయిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుండి గురుకుల ప్రవేశ పరీక్షకు 14 మంది విద్యార్థులు పాల్గొనగా పదిమంది విద్యార్థులు ప్రవేశలకు సీట్లు సాధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూమేష్ మాట్లాడుతూ ఈ విజయం మా పాఠశాల ఉపాధ్యాయుల దని వారు ప్రణాళిక బద్ధంగా కష్టపడి పిల్లలకు మంచి చదువు ఇస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా వారికి సహకరించారు. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అని నిరూపిస్తున్నారు. ఇంకా నలుగురు విద్యార్థులు కూడా రెండవ దశలో సాధిస్తారని మాకు నమ్మకం ఉంది అని అన్నారు.

# ఎమ్మెల్యే సత్యం చొరవతో అభివృద్ధి పనులు వేగవంతం

**- గ్రామంలో మౌళిక వసతుల మెరుగుదల**

**- బూరుగుపల్లి గ్రామ ఉప సర్పంచ్ : కల్లెపల్లి చంద్రయ్య**

**- పట్టణాలను తలపిస్తున్న పల్లె ప్రగతి ఫలితం**

**- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సమగ్ర అభివృద్ధి**

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు : అతికం చంద్రయ్య గౌడ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలోని 8వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో రూ. 5 లక్షల నిధులు మంజూరు కావడంతో ఈ పనులు వేగంగా పూర్తయ్యాయి.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఎల్లప్పుడూ కృషి చేస్తూ ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తున్నారని అన్నారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో వార్డు ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, దుమ్ము-మట్టి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి పట్ల చూపుతున్న చిత్తశుద్ధికి ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరంకాంగ్రెస్ సీనియర్ నాయకులు అతికం చంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ, గ్రామంలో మౌళిక సదుపాయాల అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రాధాన్యంగా తీసుకొని నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని అన్నారు. ఇంకా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడే గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పల్లె ప్రగతి కార్యక్రమాల వల్ల గ్రామాలు పట్టణాలను తలపించేలా మారుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన బీసీలు వెనుకబాటు

**- రిజర్వేషన్లు కల్పించాకే పునర్విభజన చేయాలి**

**- బీసీ సాధికారత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జి : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్)ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం ఇంచార్జి పొలాస నరేందర్ బీసీల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. జనాభాలో 56 శాతం పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ప్రకటించినప్పటికీ, బీసీల సంక్షేమానికి కేవలం 3.85 శాతం నిధులు మాత్రమే కేటాయించడం నిరాశ కలిగించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని నరేందర్ విమర్శించారు. స్థానిక సంస్థలలో పూర్తి స్థాయి రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్ల బీసీలు రాజకీయంగా నష్టపోయారని అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు.బీసీల ఆత్మగౌరవం, భద్రత కోసం ప్రత్యేకంగా “బీసీ రక్షణ చట్టం” తీసుకురావాలని, దాడులు, వేధింపులు, సామాజిక బహిష్కరణలను అరికట్టేందుకు ఇది అవసరమని తెలిపారు. అలాగే ఏప్రిల్ 26 నుంచి నిర్వహించనున్న జనగణనలో బీసీ కుటుంబాలను తప్పనిసరిగా లెక్కించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో సరిపడ నిధులు కేటాయించాలని, బీసీల అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం ఏప్రిల్ నెలలో నల్ల చొక్కాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కవులు, కళాకారులు, ఉద్యమకారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రతి ఇంటా సన్నబియ్యం - ప్రతి మెతుకులో ఆత్మ గౌరవం

**- సన్న బియ్యం పంపిణీకి ఏడాది పూర్తి - కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**- కాంగ్రెస్ పార్టీ నర్సింగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు : లింగంపల్లి శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,నర్సింగాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ…“ప్రతి ఇంటా సన్నబియ్యం అందించడం ద్వారా పేద ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువచ్చిన ప్రజా ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న కట్టుబాటును మరోసారి చాటుకుంది. ప్రతి మెతుకులో ఆత్మ గౌరవం నింపిన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ఆదరణ పొందింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగుతున్న ఈ పాలన నిజంగా ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం అనే నినాదానికి నిదర్శనం. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్,దుద్దిల్ల శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం లకు మా గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో మరింత అభివృద్ధి తీసుకురావాలని కోరుకుంటున్నాము” అని తెలిపారు.

# ఏప్రిల్ 01 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలు

**జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు,**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు.అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రజ్ఞాపూర్ గ్రామ దేవతల వార్షికోత్సవం

**- భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ వేడుకలు**



గజ్వేల్(ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. గ్రామ పొలిమేరల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచే ఆలయంలో అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సిద్ధం చేసి, బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. లోక కళ్యాణార్థం, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ అర్చకులు ఆలయ ప్రాంగణంలో హోమాలు, శాంతి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఏటా ఈ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాకని బిక్షపతి, వైస్ చైర్మన్ శివ్వని ఎల్లం, జనరల్ సెక్రటరీ సైదామొల్ల నాగరాజు, జాయింట్ సెక్రటరీ దాకని దత్తయ్య, క్యాషియర్ గుండ్ర నర్సింలు, ఆలయ కమిటీ సభ్యులు గుండ్ర నర్సయ్య, సాయిరాములు, సైదామొల్ల మల్లేశం, ఈదోళ్ల యాదగిరి, సల్ల శ్రీనివాస్, గజ్వేల్ సాయిలు, గుండ్ర నర్సింగరావు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ఇన్స్పెక్టర్లు డ్యూటీ చేయడం మానేశారా.?



- జిహెచ్ఎంసిలో పూర్తి బాధ్యతారాహిత్యంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ల వైనం
- ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఫుడ్ ఇన్స్పెక్టర్లు
- నాణ్యత లేని ఆహార పదార్థాల తయారీకి ట్రేడ్ లైసెన్, ఫుడ్ లైసెన్ ఇస్తున్న వైనం
- ఆహార పదార్థాల నాణ్యత పై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రెచ్చిపోతున్న కల్తీ
- రోగాల బారిన పడుతున్న ప్రజలు పట్టించుకోని ప్రభుత్వం
- ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తని ఖైరతాబాద్ జోన్ ఫుడ్ ఇన్స్పెక్టర్




**(గౌటీ రామకృష్ణ--ప్రశ్న న్యూస్)**

జిహెచ్ఎంసి పరిధిలో ఆహార భద్రతపై ప్రశ్నార్థక పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఖైరతాబాద్ సర్కిల్‌లో ఫుడ్ ఇన్స్పెక్టర్ల పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న అధికారులను సంప్రదించేందుకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడం, ఫిర్యాదులు పట్టించుకోకపోవడం వంటి అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి నేరుగా సంబంధించిన అంశం కావడంతో అధికారుల నిర్లక్ష్యం మరింత ఆందోళన కలిగిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని అనేక ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాల విక్రయం విస్తృతంగా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### దాడులు ఎక్కడవుతున్నాయి.? ఎప్పుడు చేస్తున్నారో.?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇన్స్పెక్టర్ల దాడులు ఎక్కడ కనిపించడం లేదు. ఒకవేళ చేసినా లోలోపల అంతర్గత ఒప్పందాలతో వివరాలను బయటికి చెప్పడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్లు దుకాణాలు, రోడ్డు పక్కన ఉండే ఆహార కేంద్రాలు చాలా చోట్ల ఏమాత్రం నాణ్యత లేని పదార్థాలతో ఆహారం తయారు చేసి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్న అధికారులు అసలు పట్టించుకోకపోవడం ఫోన్ ఎత్తకపోవడం వల్ల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా మారుతున్న ఉన్నత అధికారులు చోద్యం చూస్తున్నారు వ్యవస్థని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అశుభ్ర వాతావరణం, పాడైన నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు, తక్కువ ప్రమాణాల మసాలాలు, వ్యాపారులు వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజలు చెబుతున్న ప్రకారం, ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినప్పుడు సంబంధిత ఫుడ్ ఇన్స్పెక్టర్లు అసలు ఫోన్ ఎత్తకపోవడం సాధారణ విషయంగా మారింది. కొన్నిసార్లు ఫిర్యాదు స్వీకరించినా తరువాత ఎలాంటి చర్యలు తీసుకోరని ఆరోపిస్తున్నారు. "ఫిర్యాదు చేస్తే ప్రయోజనం ఉండదు" అనే నిరుత్సాహ భావన ప్రజల్లో పెరిగిపోయింది. అధికారుల నిర్లక్ష్య వైఖరి మరింతగా అక్రమాలకు ప్రోత్సాహం ఇస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### మామూళ్ల వ్యవహారంతో అధికారుల నిర్లక్ష్యమా.?

ఇక మరోవైపు ఫుడ్ ఇన్స్పెక్టర్లపై "మామూళ్ల వ్యవహారం" ఆరోపణలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. కల్తీ ఆహారం తయారు చేస్తున్న కేంద్రాల గురించి పూర్తి సమాచారం ఉన్నప్పటికీ, కొంతమంది అధికారులు కళ్లెదుట జరిగే అక్రమాలను పట్టించుకోవడం లేదని ఇందుకు వాళ్లకు అందుతున్న నెలనెలా మాముల్లే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల నెల జీతం తీసుకుంటూ విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తోంది. అధికారులు "మామూళ్లు తీసుకుంటే చర్యలు ఉండవు" అనే భావన ప్రజలు బలపడుతుంది అది మొత్తం వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అమీర్పేట సర్కిల్ పరిధిలో నాణ్యతాలేని ఆహార పదార్థాలు అమ్ముతున్నారని ఫిర్యాదు చేయడానికి ఖైరతాబాద్ ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఎత్తడం లేదని, వాట్సాప్ లో మెసేజ్ పెట్టిన కనీస స్పందన లేదని గతంలో కూడా ఈ అధికారి తీరు ఇలాగే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆహార భద్రత విషయంలో అధికారుల నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఇప్పటికే అనేక ఘటనలు రుజువు చేశాయి. కల్తీ ఆహారం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు, ఆహార విషబాధలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు వంటి బలహీన వర్గాలపై దీని ప్రభావం మరింత తీవ్రమవుతోంది. అయినప్పటికీ, బాధ్యత వహించాల్సిన అధికారులు స్పందించకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చుతోంది.ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్లు, ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఫుడ్ ఇన్స్పెక్టర్ల పనితీరుపై సమగ్ర విచారణ జరపాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్లను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నగరవ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి కల్తీ ఆహార వ్యాపారంపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని గుర్తుచేస్తున్నారు.ఫిర్యాదులను స్వీకరించే ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు, ఆన్‌లైన్ వ్యవస్థలను బలోపేతం చేసి, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకునే విధానం అమలు చేయాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ శాఖలో అధికారుల పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ ఉంటేనే ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించవచ్చు. లేనిపక్షంలో, కల్తీ ఆహార దందా మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు కల్తీ ఆహార సరఫరా పై మేల్కొని చర్యలు తీసుకుంటారా.? లేక ఇదంతా "మామూళ్ల మాయ"లోనే అని వదిలేస్తారా.? అన్నది చూడాలి.

# ఇక మీరు కూడా మా శత్రువులే

## - అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలకు ఇరాన్ వార్నింగ్




**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సంచలన హెచ్చరిక జారీ చేసింది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, గూగుల్, ఆపిల్ వంటి బడా అమెరికన్ టెక్ కంపెనీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని బెదిరించింది. ఈ సంస్థలు తమకు చట్టబద్ధమైన లక్ష్యాలని ప్రకటించింది. ఇరాన్ ప్రభుత్వ అనుకూల మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఈ వివరాలను వెల్లడించింది. ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ఈ కంపెనీలపై దాడులు ప్రారంభిస్తామని ఐఆర్జీసీ స్పష్టం చేసినట్లు పేర్కొంది. మధ్యప్రాచ్యంలోని ఈ కంపెనీల కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది, సమీపంలో నివసించే ప్రజలు వెంటనే ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.ఇజ్రాయెల్ జరిపిన దాడులకు, అమెరికా ఇంటెలిజెన్స్ అందించిన మద్దతుకు ప్రతీకారంగానే ఈ హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ అత్యాధునిక కృత్రిమ మేధస్సు (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి ఇరాన్‌కు చెందిన సుప్రీం లీడర్‌తో సహా 250 మందికి పైగా సీనియర్ అధికారులను హతమార్చిందని, దీనికి ఈ టెక్ కంపెనీలు సహకరించాయని ఐఆర్జీసీ ఆరోపిస్తోంది. అందుకే ఈ సంస్థలను 'చట్టబద్ధమైన లక్ష్యాలు'గా పరిగణిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది. మెటా, గూగుల్, ఆపిల్‌తో పాటు బోయింగ్, టెస్లా వంటి 15కు పైగా కంపెనీలు తమ హిట్ లిస్ట్‌లో ఉన్నాయని ఐఆర్జీసీ తెలిపింది. తమ నాయకులపై ఇలాంటి 'టార్గెటెడ్ హత్యలు' కొనసాగితే దాడుల తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరించింది. కాగా, ఈ నెలలోనే బహ్రెయిన్, యూఏఈలలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై డ్రోన్ దాడులు జరిగినట్లు అమెజాన్ ధృవీకరించడం గమనార్హం.

# ఓపికగా వినే నాయకుడు ఉండడం మన అదృష్టం

## - క్లస్టర్ ఇంచార్జిల శిక్షణ కార్యక్రమంలో నారా లోకేష్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్నారు. 'కాఫీ కబుర్లు' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని పార్టీ యూనిట్లను, బూత్‌లను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరారు. అందరం కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని ఒక పటిష్టమైన వ్యవస్థలా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ఓపికగా వినే గొప్ప నాయకుడు చంద్రబాబు గారు మనకు ఉండటం మనందరి అదృష్టమని లోకేశ్ అన్నారు. శిక్షణకు హాజరైన క్లస్టర్ ఇంఛార్జ్‌లను ఉద్దేశించి, "మీరంతా తెలుగుదేశం పార్టీకి కాబోయే భవిష్యత్ నాయకులు" అని పేర్కొంటూ వారిలో ఉత్సాహం నింపారు.

# గ్యాస్ మాఫియా 'యుద్ధ' తంత్రం

- రూ. 1960 సిలిండర్ రూ. 5500
- కాల్ రికార్డింగ్‌లో బయటపడ్డ దందాగాళ్ల బాగోతం
- యుద్ధం వల్ల రేట్లు పెరిగాయి.. కావాలంటే తీసుకో, లేదంటే లేదు
- చిన్న వ్యాపారుల కష్టకాలంలోనూ ఆగని 'బ్లాక్' దందా
- అక్రమాలను కట్టడి చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం చెందిందన్న విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలే పెట్టుబడిగా గ్యాస్ మాఫియా సాగిస్తున్న అరాచకం పరాకాష్టకు చేరింది. ఎక్కడో జరుగుతున్న యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ, స్థానికంగా కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుడి రక్తాన్ని జుర్రుకుంటున్నారు. తాజాగా బయటపడ్డ ఒక ఆడియో కాల్ రికార్డింగ్ గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందా ఎంత క్రూరంగా సాగుతుందో కళ్లకు కడుతోంది.

### కాల్ రికార్డింగ్‌లో దిగ్భ్రాంతికర విషయాలు..

ఒక చిన్న వ్యాపారి (నరేష్) గ్యాస్ సరఫరా చేసే వ్యక్తి(ప్రేమ్) మధ్య జరిగిన సంభాషణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. వారి మాటల్లో
కేవలం రెండు రోజుల క్రితం రూ. 4000 ఉన్న సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ. 5500 కు పెంచేశారు. అసలు ప్రభుత్వ ధర రూ. 1960 ఉంటే, దానికి రెండున్నర రెట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. మొన్నటి వరకు రూ. 1960 కే ఇచ్చాం, కానీ యుద్ధం మొదలయ్యాక ధరలు మారిపోయాయి, స్టాక్ రావడం లేదంటూ సరఫరాదారుడు బుకాయించడం గమనార్హం. గ్యాస్ లేకపోతే హోటల్ నడవదు, రేపు వచ్చే గిరాకీ పోతుంది. కాబట్టి తప్పక కొంటున్నాను అంటూ ఆ వ్యాపారి పడుతున్న వేదన వర్ణనాతీతం. కష్టకాలంలో మేము మీకు గ్యాస్ ఇస్తున్నాం కాబట్టి, రేపు పరిస్థితులు చక్కబడ్డాక కూడా మా దగ్గరే గ్యాస్ తీసుకోవాలి అంటూ దందాగాళ్లు షరతులు విధిస్తుండటం వారి



బరితెగింపుకు నిదర్శనం.

### చిన్న వ్యాపారుల కన్నీళ్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు మేడ్చల్ మండలంలో వేలాది మంది చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఒక సిలిండర్ కేవలం 4 నుండి 5 రోజులు మాత్రమే వస్తుందని, ప్రతి వారం గ్యాస్ కోసం రూ.10 వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు ఏమీ తెలియనట్టు నిద్రపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారులు మేల్కొనేది ఎప్పుడు.?

వ్యాపారుల మధ్య జరుగుతున్న ఈ కాల్ రికార్డింగ్లే సాక్ష్యంగా కనిపిస్తున్నా, పత్రికల్లో ప్రచురితమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల నుంచి సిలిండర్లు ఎక్కడికి వెళ్తున్నాయి.? బ్లాక్ మార్కెట్ కు ఎలా చేరుతున్నాయి.? అనే అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే సామాన్యుడి దృష్టిలో ప్రభుత్వం విఫలం చెందిందని చెడ్డ పేరు వస్తుంది. దానికి తోడు సామాన్యుడి కడుపు మంట చివరకు రోడ్డెక్కే ప్రమాదం ఉంది. తక్షణమే రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక తీసుకుని విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపి ఈ 'యుద్ధ తంత్రం' పేరుతో దోచుకుంటున్న మాఫియా ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రభుత్వం అబాసుపాలు కాక తప్పదు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘన

## - టీవీకే అధినేత విజయ్‌పై ఈసీ కేసు



**చెన్నై (ప్రశ్న న్యూస్)** ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్‌పై ఎన్నికల సంఘం కేసు నమోదు చేసింది. ఒక బహిరంగసభలో ఎన్నికల నిబంధనలను అతిక్రమించారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెరవల్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఈకేసు నమోదైంది. బీఎన్ఎస్ 2023, 126(2), బీఎన్ఎస్ సెక్షన్ 189 (2), 223 బీఎన్ఎస్ 3(ఏ) మరియు 3(5) ల కింద పెరవల్లూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీవీకే అధినేత విజయ్ రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటిస్తున్నారు.ఇటీవల ఒక బహిరంగ సభ సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈసీ ఆరోపించింది. అధికారుల అనుమతి లేకుండా సభలో ఏకంగా 30 లౌడ్ స్పీకర్లు ఉపయోగించారని, అలాగే 5,000 మందికి మించి ప్రజలు సభకు హాజరయ్యారని, దీనితో ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆరోపిస్తూ ఈసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్‌తోపాటు సభకు హాజరైన పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati